సాక్షి తిరుపతి

గురువారం । 18 । మే । 2023



అందరికీ 'ఉపాధి' పనులు

ఉపాధి హామీ పథకం కింద కూలీలందరికీ పని కల్పించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. –8లో



కోన అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

పెనుశిల క్షేత్రం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. –8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	27
చిత్తూరు	39	27
తిరుమల	36	23
గూడూరు	43	29
నగరి	42	28

న్యూస్‌రీల్

సమాచారహక్కు కరదీపిక ఆవిష్కరణ



కరదీపికను ఆవిష్కరిస్తున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : సమాచార హక్కు చట్టం –2005 కరదీపికను ఎంపీ మద్దిల గురుమూర్తి బుధవారం తిరుపతిలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజల చేతిలో సమాచార హక్కు చట్టం పాశుపతాస్త్ర మన్నారు. పరిపాలన పారదర్శకంగా ఉండాలంటే ఆర్టీఐ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం ఎంపీ గురుమూర్తిని ఆర్టీఐ రాష్ట్ర కో–ఆర్డినేటర్ జేవీఎస్ బాబు, జాయింట్ కో–ఆర్డినేటర్ హనుమంత్ నాయక్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఆర్టీఐ కో–కన్వీనర్లు చైతన్య కుమార్, వేమూరి ధనంజయ్, యువనేస్తం అసోసియేషన్ నేత మునిశేఖర్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా మామిడి దిగుబడి



దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్ : మామిడి దిగుబడి ఆశాజనకంగా ఉందని ఉద్యానశాఖ జిల్లా అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మూడు దశల్లో వచ్చినప్పటికీ దిగుబడి అధికంగానే ఉందని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 22వేల హెక్టార్లలో మామిడి సాగు చేస్తున్నారని, మొత్తం 1.10 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానుందని వివరించారు. రకాన్ని బట్టి కిలో రూ.18 నుంచి రూ.25 వరకు పలుకుతోందన్నారు. జిల్లా నుంచి రాజస్థాన్, ఢిల్లీ, హైదరాబాద్‌తోపాటు న్యూజీలాండ్, దక్షిణ కొరియా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ధర అధికంగా ఉందని ముందగా కోత చేపట్టకూడదని, మామిడి కాయలు పక్వానికి చేరుకున్న తర్వాతే కోత ప్రారంభించాలని సూచించారు.

సెంట్రల్ బస్టాండ్ నిర్మాణానికి సమష్టి కృషి



మాట్లాడుతున్న రైట్స్ సంస్థ ప్రతినిధి ప్రియాంకా కటారియా

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నూతన భవన నిర్మాణానికి సమష్టిగా కృషి చేద్దామని ఢిల్లీకి చెందిన రైట్స్ సంస్థ ప్రతినిధి ప్రియాంకా కటారియా కోరారు. బుధవారం ఆమెతోపాటు 6 మంది సభ్యులతో కూడిన బృందం తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను సందర్శించారు. అనంతరం ఆర్టీసీ ఈడీ గోపీనాథ్‌రెడ్డి, డీపీటీఓ చెంగల్‌రెడ్డితో సమావేశమయ్యారు. బస్టాండ్ ప్రాంగణ విస్తీర్ణం, రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య, సర్వీసులు, దుకాణాలు, ఆదాయ వివరాలపై నివేదిక స్వీకరించారు. ఢిల్లీ బృంద సభ్యులు మాట్లాడుతూ నిర్మాణ పనులు ప్రారంభించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు తమకు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, ఏటీఎం రామచంద్రనాయుడు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసెట్‌కు 207 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్‌కు బుధవారం 217మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎంపీసీ స్ట్రీమ్ పరీక్షలో భాగంగా ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షను తిరుపతి– 3, పుత్తూరు–2, గూడూరులో 3, మొత్తం 8 కేంద్రాల్లో నిర్వహించారు. రెండు సెషన్స్ కలిపి 3,697మంది విద్యార్థులకు గాను 3,480 మంది పరీక్షకు హాజరయ్యారు.

నేడు పెంచలకోన హుండీ లెక్కింపు

రాపూరు : పెంచలకోన ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీల ద్వారా వచ్చిన కానుకలను శ్రీవారి నిత్య కల్యాణమండపంలో ఉదయం 7.30 నుంచి లెక్కించనున్నట్లు వివరించారు. హుండీ లెక్కింపునకు హాజరయ్యే భక్తులు పంచె, దోవతి మాత్రమే ధరించాలని సూచించారు.

మహిమాన్వితం.. విశ్వరూపం

తిరునగరిలో ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిశాయి.. జనసందోహంతో వీధులన్నీ కిక్కిరిశాయి.. వివిధ వేషాలు ధరించిన భక్తులతో నిండిపోయాయి.. తాతయ్యగుంట గంగమ్మ జాతర మహోత్సవాల్లో ఆఖరి రోజున సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారి విశ్వరూప దర్శనానికి ఏర్పాటు చేసిన గ్యాలరీలు కిటకిటలాడాయి. శ్రీవారి చెల్లెలి దివ్యతేజస్సును వీక్షించి పురజనుల తనువులు పులకించాయి. మహిమాన్విత స్వరూప కటాక్షంతో తరించాయి. గంగమ్మతల్లి చెంప నరకడంతో ఉత్సవాలు పరిపూర్ణమయ్యాయి.



అమ్మవారి సేవలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



తాతయ్యగుంట గంగమ్మతల్లి విశ్వరూపం



ఆలయంలో అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

- అట్టహాసంగా ముగిసిన తాతయ్యగుంట గంగమ్మ జాతర
- కనులపండువగా సాగిన మహోత్సవం
- అమ్మవారి దర్శనంతో పులకించిన భక్తజనం
- ప్రజల సహకారంతోనే విజయవంతం : ఎమ్మెల్యే భూమన

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మజాతర కనుల పండువుగా సాగింది. ఏడు రోజుల జానపద జాతరతో వేలాది మంది భక్తులు తల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబసమేతంగా పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించుకున్నారు. తిరుపతి నగరవీధులు గంగమ్మ నామస్మరణలు, జాతర వేషాల సందడి, డప్పుల దరవుల మోతతో హోరెత్తింది. జాతర చివరి రోజైన మంగళవారం అర్ధరాత్రి తర్వాత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ప్రత్యేకంగా కొలువుదీరిన విశ్వరూప ప్రతిమ దర్శనంతో భక్తులు పులకించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేకర గ్యాలరీలు భక్తులు నిండిపోయాయి. గంగమ్మ తల్లీ..కాపాడు తల్లీ అంటూ అమ్మవారిని వేడుకున్నారు. ఎమ్మెల్యే భూమన అమ్మవారి విశ్వరూప దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల వెంకన్న చెల్లెలుగా అత్యంత ప్రాచీన చరిత్ర కలిగిన గంగమ్మతల్లి ఆలయ ప్రాశస్త్యాన్ని దేశ వ్యాప్తం చేయాలని ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అందించిన పిలుపుతో వారం రోజుల పాటు జాతర అంగరంగ వైభవంగా సాగింది. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. చివరి రోజు రాత్రి పేరంటాల వేషం ధరించిన కైకాల కులస్తుడు నగర పుర వీధులు విహరిస్తూ భక్తుల పూజలందుకున్నారు.



గంగమ్మ ప్రతిమ చెంప నరకడంతో మట్టి ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు

బుధవారం వేకువ జామున 2.56 గంటలకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని చేరుకున్న పేరంటాలు గంగమ్మతల్లి విశ్వరూప ప్రతిమ చెంపనరకడంతో జాతర పరిసమాప్తమైంది. అమ్మవారి విశ్వరూప ఘట్టాన్ని చూసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అత్యంత పవిత్రంగా భావించే విశ్వరూప ప్రతిమ మట్టి కోసం పోటీపడ్డారు.

ప్రజల సహకారంతోనే..

తాతయ్యగుంట గంగమ్మ జాతరను ప్రజల సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించగలిగామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆధ్యాత్మిక నగరం ఏడు రోజుల పాటు గంగ జాతర వేడుకలతో మరింతగా సౌరభాలను వెదజల్లిందని వెల్లడించారు.

నాటకం..నవరసభరితం

గూడూరు : సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా ప్రదర్శిస్తున్న జాతీయ స్థాయి నాటికల పోటీలు బుధవారంతో ముగిశాయి. కొప్పోలుకు చెందిన పండు క్రియేషన్స్ వారు ప్రదర్శించిన ''పక్కింటి మొగుడు'' అనే నాటిక నవరస భరితంగా సాగింది. కార్యక్రమంలో సంస్కృతి సమ్మేళనం అధ్యక్షుడు కనుమూరు హరిచంద్రారెడ్డి, నాటక విభాగ వ్యవహారకర్త జానా శివయ్య, కార్యదర్శి మునిగిరీష్, కట్టా మురళీకృష్ణ, చెంచురామయ్య పాల్గొన్నారు.



పక్కింటి మొగుడు నాటికలోని ఓ సన్నివేశం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోవడంతో క్యూలైన్ కృష్ణ తేజ గెస్ట్ హౌస్ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 77,436 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీ ద్వారా రూ.3.77 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

పరుగుల ప్రవాహం

వేడి గాలులతో భానుడు నిప్పులు కురిపిస్తుంటే..ఎండను సైతం లెక్క చేయకుండా గ్రామీణ క్రీడాకారులు మైదానంలో పరుగుల ప్రవాహం సృష్టిస్తున్నారు. తుమ్మలగుంట వేదికగా నిర్వహిస్తున్న చంద్రగిరి ఐపీఎల్‌గా కీర్తించే వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. నాలుగో రోజు బుధవారం 58 మ్యాచ్‌లు జరిగాయి. గ్రామీణ క్రీడాకారులు అద్భుతంగా రాణిస్తున్నారు. 10 ఓవర్లలోనే వందల పరుగులు సాధిస్తూ సత్తా చాటుతున్నారు.



విజేతలకు అవార్డులు అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

- హోరాహోరీగా చంద్రగిరి ఐపీఎల్
- భారీ షాట్‌లతో అలరించిన గ్రామీణ క్రీడాకారులు
- మైదానాలను సందర్శించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- మ్యాచ్‌ల నిర్వహణపై ఎమ్మెల్యే చెవిరెడ్డికి ప్రశంస
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ''తుమ్మలగుంట క్రీడా కాంప్లెక్స్ మరో ప్రపంచంలా ఉంది. ఎటు చూసినా క్రీడాకారులే కనిపిస్తున్నారు. ఒక్క మైదానం సిద్ధం చేయాలంటేనే కష్టం. అలాంటిది ఒకేచోట 16 పిచ్‌లను తీర్చిదిద్దడమే కాకుండా, రోజూ 60 మ్యాచ్‌లు నిర్వహించాలంటే మానవ మాత్రులకు సాధ్యం కాదు. ఇది ఒక్క చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి మాత్రమే సాధ్యం'' అంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. బుధవారం క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్యాట్ పట్టి కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. టోర్నీలో పాల్గొనే జట్లకు క్రికెట్ కిట్‌లను బహూకరించారు. మ్యాచ్‌ల్లో విజేతలకు అవార్డులు, ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో కలిసి టాప్‌లెస్ జీపులో 16 క్రీడా మైదానాలను సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ప్రోత్సహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయడం ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రత్యేకతని ప్రశంసించారు. గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడానికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని తెలిపారు.

అంగవైకల్యాన్ని జయించి.. అజేయంగా నిలిచి

ఎర్రావారిపాళెం మండలం కోటకాడపల్లె పంచాయతీకి చెందిన రెడ్డితేజ పుట్టుకతో మూగ, చెవిటితనంతో ఇబ్బంది పడుతున్నాడు. అయితే క్రికెట్ మీద మక్కువతో శిక్షణ పొందాడు. వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో తన ఊరు జట్టుతో కలసి ఆడేందుకు అవకాశం వచ్చింది. బ్యాటింగ్‌లో కేవలం 19 బంతుల్లోనే 36 పరుగులు చేశాడు. అంతే కాదు తన బౌలింగ్ తో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపిస్తూ నాలుగు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. బెస్ట్ బ్యాట్స్ మన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఆల్‌రౌండర్ అవార్డులను కైవసం చేసుకున్నాడు.

పరుగుల వర్షం కురిపించిన భజరంగీ జట్టు

మంగళం పంచాయతీ నుంచి బరిలోకి దిగిన భజరంగీ జట్టు అత్యధికంగా 10 ఓవర్లకు 186 పరుగులు చేసి విజేతగా నిలిచింది. మంగళం క్వార్టర్స్‌కు చెందిన లోకేష్ 22 సిక్స్‌లు కొట్టి జట్టు స్కోరును డబుల్ సెంచరీ దిశగా పరుగులు పెట్టించాడు. చిచ్చర పిడుగులా రెచ్చిపోయిన లోకేష్ ఆటతీరును తిలకించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బెస్ట్ బ్యాట్స్‌మన్ బహుమతి అందించారు. చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి క్రీడాకారులకు కిట్‌లు పంపిణీ చేశారు.



సి.మల్లవరం జట్టుకు క్రికెట్ కిట్ బహూకరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



సరదాగా బ్యాటింగ్ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

హవ్వ.. జాతరపైనా రాజకీయమా?

- గంగజాతర నిర్వహణపై పీఠాధిపతుల ప్రశంసలు
- విజయవంతం కావడం జీర్ణించుకోలేకే విమర్శలు
- టీడీపీ నేతలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భయం

సాక్షి, తిరుపతి : టీడీపీ నేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భయం పట్టుకుంది. తిరుపతి తాతయ్యగుంట గంగ జాతరనూ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తున్నారు. తిరుపతి చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా జాతర అత్యద్భుతంగా జరగడం టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లపైనా విమర్శలు చేసి ఇప్పటికే నవ్వులపాలయ్యారు. ఇప్పుడు అదే తరహాలో గంగ జాతరపైనా విమర్శలు చేస్తుండడంపై భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ''మీ హయాంలో ఇంత గొప్పగా ఎందుకు చేయలేకపోయారు? ఆలయాన్ని పునర్నిర్మించాలని ఆలోచన ఎందుకు చేయలేదు? ఊరంతా జాతరలో పాలుపంచుకుంటుంటే.. మీరంతా ఎందుకు దూరంగా ఉన్నారు?'' అని టీడీపీ నేతలను ప్రశ్నిస్తున్నారు. శ్రీవారి సోదరిగా పిలువబడుతున్న తాతయ్య గుంట గంగమ్మ ఆలయాన్ని ఎమెల్యే భూమన కరుణాకరరెడ్డి కృషితో దేవదాయశాఖ, టీటీడీ నిధులతో పునర్నిర్మించిన విషయం తెలిసిందే. అది కూడా రాతి కట్టడంతో నిర్మించడాన్ని పలువురు పీఠాధిపతులు సైతం ప్రశంసించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే మహా కుంభాభిషేకాన్ని కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించడం విశేషం. ఈ మహాకుంభాభిషేకానికి విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రస్వామి, దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి, కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి, శక్తి పీఠం రమ్యానందస్వామి హాజరై అభినందనలు తెలియజేయడమే ఇందుకు నిదర్శనంగా స్థానికులు చర్చించుకుంటున్నారు. గత ఏడాది శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగా తాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పించి సంప్రదాయాన్ని పునః ప్రారంభించిన విషయం తెలిసిందే. అంతటితో ఆగని సీఎం వైఎస్ జగన్ తాతయ్యగుంట గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించి అమ్మవారిపై తమకున్న భక్తిభావాన్ని చాటుకున్నారు.

జాతరలోనే జగన్నామస్మరణే!

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఏడు రోజులపాటు గంగ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. చాటింపే జాతరలా నిర్వహించారు. అమ్మవారిపై తమకున్న భక్తిభావాన్ని నిత్యం నిరూపించుకున్నారు. వారం రోజుల్లో ప్రతిరోజూ ప్రత్యేకతే కనిపించింది. గంగమ్మ తల్లికి మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు, మంత్రులు, ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్యేలు, తిరుపతి నగరపాలక సంస్థ, మేయర్, డిప్యూటీ మేయర్లు, అన్ని డివిజన్ల కార్పొరేటర్లు ఎవరికి వారు అమ్మవారికి సారె సమర్పించారు. వారం రోజుల పాటు నిర్వహించిన గంగ జాతర నిజంగా బ్రహ్మోత్సవాలను తలపించిందని పలువురు అభినందించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలు టీడీపీ నేతలకు మింగుడు పడడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేని విమర్శించేందుకు ఏం దొరుకుతుందా అని భూతద్దం పెట్టుకుని వెతుకుతున్నారు. విమర్శించేందుకు ఏమీ దొరక్క టీడీపీ నేతలు పనిగట్టుకుని ఆరోపణలు గుప్పించడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు. భక్తులందరికీ జాతరలో గంగమ్మతల్లి కనిపిస్తే.. టీడీపీ నేతలకు మాత్రం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కనిపించడం కొసమెరుపు.

అమ్మవారిపై భక్తితో సేవచేస్తున్నా



అమ్మవారిపై ఉన్న భక్తితో నేను 28 ఏళ్లుగా సేవ చేస్తున్నా. ఏటా జాతరకు ఆలయంలో పూల అలకరణ చేస్తుంటా. అందులో భాగానే ఈ ఏడాదీ ప్రత్యేక అలంకరణ చేయమని బెంగుళూరులోని కాంట్రాక్టర్‌కు అప్పగించా. అంతే తప్ప ఇందులో దురుద్దేశం లేదు. ఈ విషయాన్ని రాజకీయం చేయడం తగదు. – శేఖర్‌రెడ్డి, ఆలయంలో పూల అలంకరణ చేపట్టిన భక్తుడు

అమ్మ ఆగ్రహానికి గురికాక తప్పదు



గత 10 సంవత్సరాలుగా గంగమ్మతల్లి జాతర వేడుకలకు ఆలయంలో పూల అలంకరణ ఒక దాత తన సొంత ఖర్చులతో చేస్తున్నారు. దాత చేసిన అలంకరణలో పొరబాటును ఆలయ అధికారులకు, ఎమ్మెల్యే భూమనకు ఆపాదిస్తూ అవాకులు చవాకులు పేలడం వారి నీచపు కుట్రలకు నిదర్శనం. జాతరతో భక్తితన్మయత్వంతో భక్తులు సంతోషంగానున్న సమయంలో ఇలాంటి కుట్ర పూరితం చర్యలకు దిగడం టీడీపీ నేతల వెన్నతో పెట్టిన విద్య. ఇలాంటి వాటిని మానకుంటే గంగమ్మ తల్లి ఆగ్రహానికి గురికాక తప్పదు. – కట్టా గోపీయాదవ్, శ్రీతాతయ్యగంట గంగమ్మ ఆలయ చైర్మన్

అందరికీ అందుబాటులో వైద్యం



ఈసీజీ పరీక్షల కేంద్రంలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి

పాకాల : మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో వైద్యసేవలందిస్తున్నామని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఇరంగారిపల్లెలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి అపోహలు లేకుండా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ముందస్తుగా వ్యాధుల నిర్ధారించుకుంటే చికిత్స చేయించుకోవడం సులభతరమవుతుందని తెలిపారు. ఆ మేరకు మందులను 104 వాహనం ద్వారా నేరుగా ఇంటికే పంపుతామని వివరించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామీణులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్దర ప్రతి ఒక్కరికీ నిత్యం అల్పాహారం, భోజన వసతి ఉంటుందని వెల్లడించారు. నియోజవర్గంలో సుమారు 5 లక్షల మందికి వైద్య పరీక్షలు చేయించే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు స్పష్టం చేశారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

వెంకటగిరి: పెంచలకోన- ఏర్పేడు జాతీయ రహదారిపై వల్లివేడు క్రాస్ వద్ద బుధవారం రాత్రి లారీ ఢీకొని యాతలూరుకు చెందిన శ్రీరాం చిన్నమ్మ (70) అనే వృద్ధురాలు మృతి చెందింది. రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయవంతంగా 'శుద్ధ తిరుమల- సుందర తిరుమల'



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుమల : ప్లాస్టిక్ రహిత ఆధ్యాత్మిక క్షేత్రంగా తిరుమలను తీర్చిదిద్దేందుకు చేపట్టిన 'శుద్ధ తిరుమల-సుందర తిరుమల' విజయవంతమైందని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో సీనియర్ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో సమష్టిగా కృషి చేసిన టీటీడీ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. శుద్ధ తిరుమలలో పనిచేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కొండపైన, నడకదారుల్లోని దుకాణదార్లకు పారిశుద్ధ నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తిరుమలకు వచ్చే యాత్రికులకు సైతం ప్లాస్టిక్ ఉత్పత్తులు వాడకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఎక్కడికక్కడ చెత్త బుట్టలను ఏర్పాటు చేసి వ్యర్థాలను అందులోనే వేసేలా అవగాహన కల్పించాలని కోరారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో వైద్యపరికరాల సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వేద విశ్వవిద్యాలయంలో కొత్తగా ధ్యాన మందిరం నిర్మించి క్రియ యోగ శిక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆధునిక జీవన విధానంలో వేద విజ్ఞానం ప్రాముఖ్యతపై ఎస్వీబీసీ కార్యక్రమాలు రూపొందించాలని స్పష్టం చేశారు. అనంతరం తిరుమల అడవుల్లో అకేషియా చెట్ల తొలగింపుపై సమీక్షించారు. సమావేశంలో జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముక్ కుమార్, లా ఆఫీసర్ వీర్రాజు, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేష శైలేంద్ర, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుపతిలో ట్రాఫిక్ మళ్లింపు

తిరుపతి క్రైమ్ : తిరుపతి నగరంలో శ్రీనివాస సేత ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా గురువారం నుంచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయని, ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్ నుంచి రిలయన్స్ వైపు వచ్చే మార్గంలో నిర్మాణం సాగుతోందన్నారు. ఈ మేరకు వాహనాల రాకపోకలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

- కడప వైపు నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు కట్టపుట్టాలమ్మ గుడి వద్ద యూటర్న్ తీసుకుని కరకంబాడి అండర్ బ్రిడ్జ్ ద్వారా మంగళం మీదుగా గెస్ట్ లైన్ హోటల్ వద్ద కొత్తగా నిర్మించిన చింతలచేను రోడ్‌లో ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలి.
- శ్రీకాళహస్తి వైపు నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు రేణిగుంట రమణ విలాస్ కూడలి, కరకంబాడి రైల్వే అండర్ బ్రిడ్జ్ ద్వారా మంగళం మీదుగా గెస్ట్ లైన్ హోటల్ వద్ద చింతల చేను రోడ్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్‌కు రావాలి.
- చెన్నై నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు గాజులమండ్యం జంక్షన్ వద్ద నుంచి రమణ విలాస్ కూడలి, కరకంబాడి రైల్వే అండర్ బ్రిడ్జ్ ద్వారా మంగళం మీదుగా గెస్ట్ లైన్ హోటల్ వద్ద చింతల చేను రోడ్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలి.
- తిరుచానూరు వైపు నుంచి తిరుపతికి వచ్చే వాహనాలు మామిడికాయల మార్కెట్ వై జంక్షన్ నుంచి లక్ష్మీపురం జంక్షన్, రామానుజ సర్కిల్ వద్ద కుడివైపుగా వెళ్ళి హీరో హోండా షోరూమ్ ఎదురుగా ఉన్న రైల్వే గేట్ దాటుకుని చింతల చేను రోడ్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్ చేరుకోవాలి.
- వెదురుకుప్పం, పచ్చికాపల్లం వైపు నుంచి తిరుపతికి రాకపోకలు సాగించే వాహనాలను అన్నమయ్య సర్కిల్ వరకు మాత్రమే అనుమతిస్తారు.
- తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ నుంచి శ్రీకాళహస్తి, చెన్నై, కడప వైపు వెళ్లే వాహనాలు లీలామహల్ జంక్షన్ మీదుగా కరకంబాడి అండర్ బ్రిడ్జ్ వద్ద ఎడమ వైపు రైల్వే గేట్ మీదుగా అనుమతిస్తారు.
- తిరుచానూరు వైపు వెళ్లే వాహనాలు చింతల చేను రోడ్ ద్వారా రైల్వే గేట్ దాటి రామానుజ సర్కిల్, లక్ష్మీపురం జంక్షన్ మీదుగా అనుమతించనున్నారు.

జూన్ 8 నుంచి చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు



సమావేశంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలను జూన్ 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారికి ఐదేళ్లకు ఒకసారి ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అన్నిశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకల వసతులు సమకూర్చాలన్నారు. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, ఆరోగ్యశాఖలు సమష్టిగా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీఓ ఆర్ చంద్రముని, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ నరేంద్రకుమార్, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,460
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,609
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

అందరికి 'ఉపాధి' పనులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : అందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులకు కూలీల హాజరుశాతం పెంచాలని సూచించారు. వారంలోపు కూలీల హాజరును 1,25,000 దాటేలా పురోగతి చూపించాలని స్పష్టం చేశారు. పంచాయతీ వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓలు, అధికారులతో సమీక్షించుకుని ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని అదేశించారు. అలాగే ఇళ్ల నిర్మాణం, హార్టికల్చర్ పనులపై దృష్టి పెట్టి నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం సరాసరి కూలీ రూ.260 ఉందని, రూ.272కి పెంచాలని చెప్పారు. సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, సీపీఓ అశోక్ కుమార్, డీఎల్‌డీఓలు సుశీలదేవి, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

రైలు కింద వ్యక్తి పడి మృతి

సూళ్లూరుపేట : పట్టణంలోని ఫైర్‌స్టేషన్ వద్ద బుధవారం రైలు కింద వ్యక్తి పడి మృతి చెందాడు. మృతుడికి సుమారు 40 ఏళ్లు ఉంటుందని జీఆర్పీ ఎస్‌ఐ మాలకొండయ్య తెలిపారు. మృతదేహం ఎడమ చేతిపై ఇంగ్లిష్‌లో మమ్మీ, డాడీ అనే పచ్చబొట్టు ఉందని, ఇతర ఆధారాలు ఏమీ లభించలేదని వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సేవల్లో గరిడీవీధి సచివాలయం ఫస్ట్



గరిడీవీధి సచివాలయ సిబ్బంది

నాయుడుపేటటౌన్ : ప్రజా వినతుల పరిష్కారంలో ఉత్తమ పనితీరు కనబరచిన నాయుడుపేట పట్టణంలోని గరిడీవీధి సచివాలయం జిల్లాలోనే ప్రథమ స్థానం దక్కించుకుంది. ఏప్రిల్ 16 నుంచి ఈ నెల 17 తేదీ వరకు మొత్తం 541 అర్జీలకు గాను 512 పరిష్కారించగా వాటిలో 28 పరిశీలనలో ఉన్నాయి. 1 మాత్రమే తిరస్కరించారు. దీంతో ప్రజలకు విశేష సేవలందించిన గరిడీవీధి సచివాలయ అడ్మిన్ షేక్ అక్తర్, ఎడ్యుకేషన్ సెక్రటరీ వై.వాసుదేవారావు, వెల్ఫేర్ సెక్రటరీ బి.సురేంద్ర, ప్లానింగ్ సెక్రటరీ ఎస్.సంధ్య, ఏఎన్ఎం ఎస్.మల్లీశ్వరి, వీఆర్ఓ పి.శివకుమార్ ఇతర సిబ్బంది , వలంటీర్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు బుధవారం అభినందించారు.

19న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



సీడీపీఓ సునంద

సైదాపురం : నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ రాపూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునంద తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని ఓరుపల్లె, కొమ్మిపాడు గ్రామాలకు సంబంధించి అంగన్‌వాడీ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజనల్ సర్టిఫికెట్లు, కాల్ లెటర్‌తో రావాలని సూచించారు.

ముక్కంటి సేవలో కేరళ హైకోర్టు న్యాయమూర్తి

తొట్టంబేడు(రేణిగుంట) : శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని బుధవారం కేరళ హైకోర్టు న్యాయమూర్తి ఆర్‌పీ కున్ని కృష్ణన్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేకంగా రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఆలయ అధికారులు గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి, అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు నాగభూషణం, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్‌కు రూ.30 లక్షలు నష్టం

ఏర్పేడు: శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లో మంగళవారం సంభవించిన గాలి, వానకు రూ.30 లక్షలు నష్టం వాటిల్లిందని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఎండిపుత్తూరు, రాజులకండ్రిగ, మడిబాక తదితర గ్రామాలు, వ్యవసాయ పొలాల్లో నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. అకాల వర్షంతో సుమారు రూ.30 లక్షల నష్టం వచ్చినట్లు వివరించారు. సకాలంలో కూలిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి రైతులు, ప్రజలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ వాసురెడ్డి, ఏఈ వాసుదేవయ్య, మునికుమార్ పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో మాజీ సైనికుడి మృతదేహం



జిజోథామస్ (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద ఓ హోటల్ పక్కన ముళ్ల పొదల్లో మాజీ సైనికుడి మృతదేహం లభ్యమైనట్లు సీఐ శ్రీహరి బుధవారం తెలిపారు. వివరాలు.. కేరళలోని పతనంతిట్ట, మల్లాపుజసెర్రీకి చెందిన జిజో థామస్(36) అనే సైనికుడు గత నెలలో ఆయన ఉద్యోగ విరమణ పొందాడు. రెండు రోజుల క్రితం ఢిల్లీ నుంచి స్వగ్రామానికి కేరళ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. ఈవిషయాన్ని తమ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. మంగళవారం రైలు పతనంతిట్ట రైల్వే స్టేషన్‌కు చేరింది. జిజో థామస్ రైలు దిగకపోవడంతో కుటుంబసభ్యులు బోగీలోకి వెళ్లగా అక్కడ లగేజీ మాత్రమే ఉంది. దీంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఇదిలా ఉండగా బుధవారం ముళ్ల పొదల్లో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఆ స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డును చూసి పతనంతిట్ట పోలీసులను సంప్రదించారు. అతను మాజీ సైనికుడని వారు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా విచారణ చేపడతామని సీఐ వెల్లడించారు.

వెండి నాగపడగ చోరీ

కోట : మండలంలోని అల్లంపాడులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సర్పంచ్ ఈశ్వరరెడ్డి ఇంటి తలుపులు పగులగొట్టి వెండి నాగపడగను అపహరించారు. బుధవారం ఈమేరకు సర్పంచ్ ఈశ్వరరెడ్డి ఖపోలీసులకు ఫిర్యాదు చేశాడు. అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి రూ.3లక్షలు విలువజేసే వెండి నాగపడగను ఇటీవల భక్తులు సమర్పించారు. భద్రత రీత్యా నాగపడగను సర్పంచ్ నివాసంలో ఉంచగా అపహరణకు గురైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పుల్లారావు తెలిపారు.

బాలికపై లైంగికదాడి : నిందితుడి అరెస్ట్

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరులో వరుసకు చెల్లెలు అయిన మైనర్ బాలికపై నాలుగు నెలలుగా లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం ఎస్‌ఐ నాగార్జునరెడ్డి వివరాలు వెల్లడించారు. పదో తరగతి పరీక్షలు రాసిన బాలిక (15)పై పెదనాన్న కుమారుడు విక్రమ్‌రాజా పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలికకు ఇటీవల కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని తెలిపింది. బాధితురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

పెంచలకోన అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

రాపూరు : పెంచలకోన క్షేత్రం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక టీజీపీ అతిథిగృహంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, దాత సహకారంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అటవీశాఖ నుంచి సేకరించిన 200 ఎకరాలతో పెనుశిలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని, సామాన్యభక్తులకే పెద్దపీట వేశామని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా శ్రీకారం చుట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు పెద్దసంఖ్యలో జనం తెలియజేస్తున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరిస్తున్నారని వెల్లడించారు. ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారి రాపూరుకు వచ్చిన మేరిగ మురళీధర్‌కు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయం దండగలా మారితే, ప్రస్తుతం పండుగలా సాగుతోందని వివరించారు. మారుమూల ప్రాంతానికి చెందిన తనను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశమిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి అభినందనీయులని కొనియాడారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శశిధర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, సంజీవరెడ్డి,ఆరీఫ్, ఫనీ, వెంకటరమణారెడ్డి, వరబాబు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి నాటక పోటీలు



ద్వితీయ బహుమతి అందుకుంటున్న కొత్త పరిమళం నటుడు

గూడూరు : పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ×అతీతం₹ నాటిక పలు విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించింది. రెండో బహుమతిని కొత్త పరిమళం నాటిక సొంతం చేసుకుంది. సినీ నటుడు భానుచందర్ మాట్లాడుతూ నాటకాల నుంచే సినీ రంగం పుట్టిందని, సాంకేతికతను అందిపుచ్చుకుంటే కలకాలం నాటక రంగం ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ నాటకంలో ప్రదర్శించిన నటులు కళ్ల ఎదుట జీవిస్తుంటారని, వారి భావాలు పలువురిని ప్రభావితం చేస్తాయని వెల్లడించారు. సందేశాత్మక కథలను ప్రజలు ఎప్పటికీ ఆదరిస్తుంటారన్నారు. అనంతరం నాటకపోటీల్లో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అమరావతి కృష్ణారెడ్డి, సోమిశెట్టి చెంచురామయ్య, మునిగిరీష్, మల్లు విజయకుమార్‌రెడ్డి, బాలకృష్ణంరాజు, శేగు ప్రసాద్, న్యాయ నిర్ణేత నిరంజన్ పాల్గొన్నారు.

టీడీఎస్, జీఎస్టీపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న జుగల్ దుగర్

వరదయ్యపాళెం: ఆదాయపన్నుశాఖ మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎంఎంఏ) ఆధ్వర్యంలో పరిశ్రమల అకౌంట్స్, ఫైనాన్స్ మేనేజర్ల కోసం ప్రత్యేకంగా టీడీఎస్, జీఎస్టీపై అవగాహన సదస్సును బుధవారం శ్రీసిటీలో నిర్వహించారు. ఈ సదస్సులో తిరుపతి ఆదాయపన్ను కార్యాలయ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సుప్రిమోట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సదస్సులో మాట్లాడుతూ టీడీఎస్, జీఎస్టీల గురించి అవగాహన కల్పించడంతో పాటు ఎటువంటి ఆలస్యం లేకుండా ఐటీ రిటర్న్‌లు దాఖలు ప్రాముఖ్యతను వివరించారు. విజయవాడ రేంజ్ సహాయ ఆదాయ పుపన్ను కమిషనర్ (టీడీఎస్) కె.శ్రీనివాస్, విజయవాడ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ దాఖలు చేసే రిటర్న్‌లు, చలానాలకు సంబంధించి రికార్డుల నిర్వహణ, ఆవశ్యకతను వివరించారు. అనంతరం మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌కు చెందిన సీఏ జుగల్ దుగర్ మాట్లాడుతూ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) నియమ, నిబంధనలపై అవగాహన కల్పించారు. సదస్సులో వివిధ పరిశ్రమలకు చెందిన 100 మంది అధికారులు పాల్గొన్నారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్, వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్ ఎంఎంఏ, ఆదాయపుపన్ను అధికారులకు సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రాముఖ్యతను వారికి వివరించారు.

నేటి నుంచి చంద్రగిరి కోటలో 'మ్యూజియం డే'

చంద్రగిరి (తిరుపతి రూరల్): చంద్రగిరి కోటలో గురువారం నుంచి మూడు రోజులపాటు అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు నిర్వహించనున్నట్లు పురావస్తు శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు తెలిపే విధంగా మ్యూజియం డే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా రోమన్, శాతవాహన, చోళ, విజయనగర, మైసూర్, ఒడయార్, టిప్పు సుల్తాన్, బ్రిటీష్, పోర్చుగీస్, బహమనీ సుల్తాన్, ఢిల్లీ సుల్తాన్, మొగల్ సామ్రాజ్యం, రిపబ్లిక్ ఇండియాకు సంబంధించిన నాణేలను ప్రదర్శించనున్నట్లు వివరించారు. అలాగే విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.